క్లుప్తంగా

జాతర నాటికైనా సిద్ధమయ్యేనా?



నిర్మాణంలో ఉన్న గంగమ్మ ఆలయం

శ్రీకాళహస్తి: ఏడుగంగమ్మల ఆలయం పునర్నిర్మాణ పనులు జాతర సమయానికైనా పూర్తి అవుతాయో? లేదోనని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఆలయ పునర్నిర్మాణ పనులు ఎన్నికల తరువాత ప్రభుత్వం మారడంతో మందగించాయి. ఈ విషయమై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి పలువురు తెలియజేయడంతో వెంటనే పనులను చేయాలని సూచనలు చేశారు. అయినా ఆ పనులు మందకొడిగా సాగుతున్నాయి. డిసెంబర్‌లో ఏడుగంగమ్మల జాతర జరుగుతుంది. ఆ జాతరకు అమ్మవార్లు ఇక్కడి నుంచి పూజలు జరగడం అనవాయితీ. నిర్మాణ పనులు పూర్తి చేసి, కుంభాభిషేకం సమయానికి పూర్తి చేస్తారో? లేదోనని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



దెబ్బతిన్న ఎడ్లబండి

నాగలాపురం: చిన్నాపట్టు వద్ద ఎడ్లబండిని గ్యాస్ ట్యాంకర్ లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు.. చిన్నాపట్టు గ్రామానికి చెందిన మార్కండేయన్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం 6 గంటలకు చిన్నాపట్టు నుంచి దాసుకుప్పంలో పొలం పనులకు ఎడ్లబండిపై వెళుతుండగా చెన్నై జాతీయ రహదారిపై చెన్నైకు వెళుతున్న ఇండియన్ గ్యాస్ ట్యాంకర్ లారీ వెనుక నుంచి ఢీ కొనడంతో మార్కండేయన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా మారడంతో స్థానికులు ఓ ప్రవేటు వాహనంలో తిరుపతిలోని నారాయణాద్రి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రెండు ఎడ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గ్యాస్ ట్యాంకర్ లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి, ఈ మేరకు ఎస్ఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేశారు.

డబ్బు తిరిగి రాబట్టాలి

సత్యవేడు: మండలంలోని మల్లవారిపాళెం పడమరకు చెందిన సంఘమిత్ర స్వాహా చేసిన రూ.6 లక్షలు రాబట్టాలని గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లవారిపాళెం పడమర సంఘమిత్రగా పనిచేసిన బాషా వద్ద స్త్రీనిధి, సీఐఎఫ్ సంఘాల రుణాలను తీసుకున్న సభ్యులు బకాయిలను తమ ఖాతాల్లో బ్యాంకులో చెల్లించాలని సంఘమిత్ర వద్ద ఇచ్చేవారమని, రుణాల చెల్లింపునకు ఇచ్చిన డబ్బును తమ ఖాతాల్లో చెల్లించకుండా సంఘమిత్ర స్వాహా చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రుణాల స్వాహాపై గత ఏడాదే అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సంఘమిత్ర స్వాహా చేసిన రూ.6 లక్షలు రికవరీ చేయాలని ఎస్ఐ హరిప్రసాద్‌కు సంఘాల సభ్యులు లక్ష్మి, సుగుణ, లలిత, బుజ్జమ్మ, లక్ష్మి, మంజుల, రేవతి, గీతమ్మ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్‌డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీలత

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం. శ్రీలత మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ 1969లో ప్రారంభమైందన్నారు. విద్యార్థుల్లో సేవాదృక్పథం కలిగి ఉండాలన్నారు. స్వచ్ఛంగా పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో చోరీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని హరహరబావి వీధిలో చోరీ జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి హరహరబావి వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహమూర్తి నివాసముంటున్నాడు. ఆయన ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ విషయం గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆయన ఇంట్లో సోమవారం రాత్రి చొరబడి, 134 బంగారు ఆభరణాలు, 1,050 గ్రాముల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. స్థానికులు సమాచారం మేరకు నరసింహమూర్తి ఇంటికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు క్లూస్‌టీమ్‌లో కలసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు మహాసభ విజయవంతం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం బలరామ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన రైతు మహాసభ విజయవంతమైంది. భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన శరణానంద స్వామి మహరాజ్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి భవనాలే

నాడు సౌకర్యాల లేమి.. ఆదరణ కరువు.. నిర్వహణ లోపం.. వెరసి.. ఆ భవనాల చుట్టూ, పైన చెట్లు ఏపుగా పెరిగిపోయి, నేడు వనాల్లా దర్శన మిస్తున్నాయి. ఫలితం వైద్య సిబ్బంది ఆ క్వార్టర్స్‌లో ఉండలేక.. బయట అద్దె భవనాలు దొరక్క.. ఇక్కట్లు పడుతున్నారు. దీంతో రోగులకు సరైన సమయానికి వైద్యసేవలు గగనమవుతున్నాయి. ఇదీ చిన్నపాండూరు పీహెచ్‌సీ క్వార్టర్స్ కథ.

శిథిలమవుతున్న సిబ్బంది నివాస భవనాలు



- శిథిలావస్థలో చిన్న పాండూరు పీహెచ్‌సీ క్వార్టర్స్
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ
- అద్దె భవనాలు దొరక్క సిబ్బందికి అవస్థ

వరదయ్యపాళెం: చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలమైపోతున్నాయి. చిన్న పాండూరులో 45 ఏళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటైంది. అప్పట్లో స్థానికంగా వైద్యులు, సిబ్బంది నివాసం ఉండడానికి వీలుగా ఆస్పత్రి సమీపంలో నివాస గృహాలు నిర్మించారు. అయితే ఆ ప్రాంతంలో వసతుల కరువు, ఇతరత్రా కారణాలతో ఆ నివాస గృహాలు ఆదరణ కోల్పోయాయి. దీంతో అన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నేడు పీహెచ్‌సీలో రౌండ్ ది క్లాక్ వైద్యసేవలు అమలుతో సిబ్బంది అక్కడే ఉండక తప్పడం లేదు. అయితే వారు ఉండడానికి ఇళ్లు లేక ఇక్కట్లు పడుతున్నారు.

అద్దె భవనాలు లేక అవస్థలు

అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే స్టాఫ్ నర్సులు, ఫీల్డ్ సిబ్బంది స్థానికంగా నివాసముండాలంటే చిన్న పాండూరు పరిసర ప్రాంతాల్లో అద్దె ఇళ్లు కరువయ్యాయి. శ్రీసిటీ పారిశ్రామికవాడలో అపోలో, హీరో పరిశ్రమలు ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతంలో ఇళ్లకు ఎక్కడలేని గిరాకీ ఏర్పడింది. దీంతో ఒక మనిషికి రూ.వెయ్యి వంతున చిన్నపాటి సింగిల్ బెడ్‌రూమ్ ఇంటికి రూ.15వేలకు పైగా అద్దెను వసూలు చేస్తున్నారు. అయితే కాంట్రాక్ట్ పద్ధతిలో నర్సులుగా ఉన్న వీరు అంత పెద్ద మొత్తంలో అద్దెలు చెల్లించలేక, ఇళ్లు దొరక్క అటు వరదయ్యపాళెం, ఇటు సత్యవేడు మండల కేంద్రాల్లో నివాసం కోసం వెళ్లాల్సిన పరిస్థితి.

నూతన క్వార్టర్స్ నిర్మించాలి

ఆస్పత్రి సిబ్బందికి ఎంతో అవసరమైన క్వార్టర్స్ నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి. 24 గంటలు పనివేళల స్థాయి కలిగిన చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రౌండ్ ది క్లాక్ పద్ధతిలో వైద్యం చేపట్టాల్సి ఉంది. దీంతో సిబ్బంది అందుబాటులో ఉండాలి. దీని కారణంగా సిబ్బందికి నివాస గృహాల ఏర్పాటు తప్పనిసరి. ఈ నేపథ్యంలో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలంటే క్వార్టర్స్ భవనాల నిర్మించాల్సి ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



"ఆస్పత్రి ప్రాంగణంలోని సిబ్బంది నివాసం ఉండే క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్పత్రికి రోజువారీ ఓపీ సంఖ్య పెరుగుతోంది. అసలే రౌండ్ ది క్లాక్ స్థాయి కలిగిన ఈ ఆస్పత్రిలో షిఫ్టుల వారీగా సిబ్బంది అందుబాటులో ఉండాలి. అలాంటి పరిస్థితుల్లో సిబ్బందికి క్వార్టర్స్ ఎంతో అవసరం. సిబ్బంది ప్రైవేటు భవనాల్లో అద్దె చెల్లించలేని పరిస్థితి. మా సిబ్బంది.. ఇబ్బంది గుర్తించి, క్వార్టర్స్ నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

– అనిత, వైద్యాధికారి, చిన్న పాండూరు పీహెచ్‌సీ

పరాకాష్టకు తెలుగు తమ్ముళ్ల పైశాచికత్వం

- అంగన్‌వాడీ కార్యకర్తపై కక్ష సాధింపు
- విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వుల జారీ



అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి (ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో టీడీపీ నాయకుల పైశాచికత్వం పరాకాష్టకు చేరింది. శ్రీకాళహస్తి మండలం మన్నవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న గాయత్రిపై కక్ష కట్టుకున్న స్థానిక టీడీపీ నాయకులు కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పలు విధాలుగా ఇబ్బందులకు గురిచేశారు. వాటన్నిటిని తట్టుకుని విధులకు హాజరవుతున్న గాయత్రిపై సీడీపీఓ శాంతి దుర్గ ద్వారా ఒత్తిడి తెచ్చారు. తానంతగా తాను రాజీనామా చేసేలా కక్ష స్వాధింపు చర్యలకు పాల్పడ్డారు. దేనికి బెదరకుండా అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి విధులకు హాజరు కావడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ద్వారా జిల్లా అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు గాయత్రిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాటిపై స్పందించిన గాయత్రి మాట్లాడుతూ తాను ఏ తప్పు చేయకపోయినా మూడు నెలల నుంచి తెలుగుదేశం నాయకులు, అధికారులు తనని మానసికంగా ఇబ్బందులు పెట్టారన్నారు. షోకాజ్ నోటీసులు, మెమోలు ఇచ్చారని, వాటన్నింటికీ తాను సమాధానం ఇచ్చానని తెలిపారు. వృత్తి పరంగా ఎటువంటి పొరపాట్లు చేయలేదని, అంగన్‌వాడీ కేంద్రంలో తనకు అప్పజెప్పిన విధులన్నింటినీ సక్రమంగా నిర్వహించానన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, తనకు న్యాయం చేయాలని కోరారు. న్యాయం కోసం ఏమి చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

సేంద్రియ ఎరువులతో భూసారం



పొలంబడిలో పాల్గొన్న ఏడీఏ భాస్కరయ్య

ఏర్పేడు: సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారాన్ని పెంచుకోవచ్చని వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా ఏడీఏ భాస్కరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చింతలపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రసాయనాలు ఎక్కువగా వాడడంతో భూములు నిస్సారవంతమవుతాయన్నారు. సేంద్రియ ఎరువులతో నేలలో సారం పెంచవచ్చన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలన్నారు. ఆరుతడి పంటలతో నీటి ఆదాతో పాటు మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. రైతులు శ్రీవరి సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త హారతి, ఏఓ షణ్ముగం, రైతులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



మదనంబేడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

సత్యవేడు: వరి సాగులో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు 'పొలం పిలుస్తోంది ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ మురళి తెలిపారు. మంగళవారం మదనంబేడు పంచాయతీలో రైతులకు ఖరీఫ్, రబీ సాగుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ శివరంజని వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాతసర్వీస్ రోడ్డులోనే బస్సులు నడపరూ!

–ఆర్టీసీ ఈడీకి స్థానికుల వినతి

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలంలోని దిగువ మల్లవరం మీదుగా పాత సర్వీస్ రోడ్డులోనే ఆర్డినరీ ఆర్టీసీ సర్వీసులను నడపాలని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు, డాక్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ పార్థసారథి నేతృత్వంలో మంగళవారం తిరుపతి జిల్లా కార్యాలయంలో ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. స్టాపింగ్ ఉండే ఆర్డినరీ సర్వీసులు సైతం కొత్త బైపాస్‌రోడ్డు మీదుగా వెళుతున్నాయని, దీని నిత్యం తిరుపతి, శ్రీకాళహస్తితోపాటు పలు ప్రాంతాలకు వెళుతున్న విద్యార్థులు, స్థానికులు బైపాస్ రోడ్డులోకి వెళ్లడానికి ఇక్కట్లు పడుతున్నారని వివరించారు. ప్రధానంగా ఆస్పత్రులకు వెళుతున్న పలువురు వృద్ధులు బైపాస్ రోడ్డు వద్దకు వెళ్లి ఆర్డినరీ సర్వీసులు ఎక్కాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై చెంగల్‌రెడ్డి స్పందించారు. జిల్లాలోని అన్ని డిపో మేనేజర్లు ఆర్డినరీ సర్వీసులను దిగువ మల్లవరం మీదుగా పాత సర్వీస్‌రోడ్డు మార్గంలో వెళ్లేలా ఆదేశిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న నిరుపేద కుటుంబానికి మంగళవారం పలువురు నిత్యావసర సరుకులు, కూరగాయలు, రూ.2 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు అయ్యప్ప, దయాకర్‌నాయుడు, సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, మురళి, బాబు, కళ్యాణ్, శివ, మునిచందు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులను అందజేస్తున్న నేతలు

స్కూల్‌గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

శ్రీకాళహస్తి: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పట్టణానికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వంద మీటర్ల పరుగు పందెం, హైజంప్‌లో వాసంతి మొదటిస్థానం, లాంగ్ జంప్‌లో రెండో స్థానం, షాట్‌పుట్‌లో తృతీయస్థానం సాధించింది. కోకోలో లాలిత్య, వాసంతి, సింధు, భానుప్రియ, మునిలక్ష్మి, భార్గవి, మేఘన, దినేష, జాహ్నవి, ప్రతిభ చూపగా డిస్కస్‌త్రోలో రక్షిత, చెస్‌లో శృతి గ్రేస్ ప్రతిభ చూపి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపల్ ప్రభావతి మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరంట్స్ కమిటీ సభ్యులు సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రతిభ వెలికితీతకు పోటీలు దోహదం

సత్యవేడు: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి క్రీడాపోటీలు దోహదపడతాయని ఎంఈఓ రవి అన్నారు. మంగళవారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు భారతి కలసి జెండా ఊపి క్రీడాపోటీలను ప్రారంభించారు. మంగళవారం విద్యార్థులకు 100, 1500, 2000 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. హైజంప్, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో, పోలీవిట్, జావిలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పీఈటీలు వి.కుమార్, మురళి, టి.సదాశివన్, అమ్ములు, రాజు, పయనీ, నాగేంద్ర, సురేంద్ర, మణి పాల్గొన్నారు.



జెండా ఊపి క్రీడలు ప్రారంభిస్తున్న ఎంఈఓ రవి

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి



సర్వసభ్యసమావేశంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు: మండలంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల గురించి మండల అధికారులు ముందుగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వాలని ఎంపీపీ వి. ప్రతిమ కోరారు. మంగళవారం మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ వి. ప్రతిమ అధ్యక్షతన జరిగింది. అంతకుముందు మండల పరిషత్ సభ్యులు, ఎంపీపీగా వి.ప్రతిమ బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సర్వసభ్య సమావేశంలో సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మీతో కలసి ఎంపీపీ వి.ప్రతిమ కేక్ కట్‌చేసి సభ్యులకు, అధికారులకు పంచి పెట్టారు. గత మూడు నెలలుగా మండలంలో జరిగే సంక్షేమ పథకాలు వివరాలు స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు తెలియజేయడంలేదని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా కార్యక్రమాలు నిర్వహించడం సబబు కాదని ఆమె అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులకు సచివాలయ కార్యదర్శులు తెలియజేయాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలో నిర్వహించే గ్రామ సభల వివరాల అజెండా ముందుగా అందజేయాలని ఎంపీటీసీ సభ్యుడు రామయ్య కోరారు. జీరో పాయింట్ వద్ద తమిళనాడుకు గంగ నీరు విడుదల కార్యక్రమాన్ని తెలుగు గంగ అధికారులు స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. దాసుకుప్పం పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్‌ఎం రికార్డులు అప్పగించకుండా వెళ్లడంతో విద్యార్థుల హాజరు నమోదు చేసేందుకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ రవిరెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డి. సరోజని, కోఆప్షన్ సభ్యురాలు మస్తాని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తహసీల్దార్ టి. సుబ్రమణ్యం, ఎంఈఓ కే. రవి, సీడీపీఓ దేవకుమారి, ఏపీఎం స్వర్ణలత, ఏఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారాలను తొలగించండి



చెత్తా చెదారం పేరుకుపోయిన ఒరవ కాలువ

ఏర్పేడు: స్థానిక ఆంధ్రాబ్యాంకు వద్ద ఉన్న ఒరవ కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏర్పేడు చెరువు కలుజు నుంచి ఆంధ్రాబ్యాంకు మీదుగా వ్యవసాయ పొలాలకు సాగునీటిని అందించే ఒరవ కాల్వ ఉంది. బ్యాంకు సమీపంలో పలువురు స్థానికులు, స్థానికేతరులు ఒరవ కాలవను పూడ్చి వంతెన ఏర్పాటు చేసి పక్కా భవనాలను నిర్మించుకుని, దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో కాలువలో నీరు నిలిచి మురుగుగా మారింది. మురుగునీటిలో స్థానికులు చెత్తా చెదారాలు వేయడంతో దుర్వాసన వస్తోంది. కాలువలో మురుగునీరు రంగుమారి చెరువును తలపిస్తోంది. చుట్టుపక్కల ఉన్న కుటుంబాలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ కల్పించండి

రేణిగుంట: మండలంలోని దిగువ మల్లవరం హైస్కూల్లో ఇటీవల సస్పెండ్ అయిన టీచర్ రవి నుంచి రక్షణ కల్పించాలని విద్యార్థులు తల్లిదండ్రుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కోరారు. మంగళవారం దిగువ మల్లవరం జెడ్పీ హైస్కూలుకు చేరుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల హెడ్ మాస్టర్ వెంకటరమణ, పాఠశాల కమిటీ చైర్మన్ ధర్మారెడ్డి బొబ్బిలిరెడ్డి, బీజేపీ నాయకులు వెంకట రమణారెడ్డిని కలిసి తమ బాధను విన్నవించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయుడు రవి అసభ్యంగా ప్రవర్తించిన విషయమై సాక్షిదినపత్రికలో కథనం రావడంతో ఆయన్ని ఇటీవల డీఈఓ శేఖర్ సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయ్యాక ఆయన, గుత్తివారిపల్లి హైస్కూల్‌కి చెందిన ఓ మహిళా టీచర్ తమ ఇంటి వద్దకు వచ్చి తమకు అనుకూలంగా లేఖ రాసి ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అనుకూలంగా ఎమ్మెల్యే దగ్గరకు వచ్చి చెప్పాలని, లేకుంటే తాము ఇక్కడే విషం తాగి చనిపోతామని బెదిరిస్తున్నారని తెలిపారు. అంతటితో ఆగకుండా తమపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. సస్పెండ్ అయిన నాటి నుంచి బెదిరింపులు ఎక్కువ అయ్యాయని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరారు. ఇలాగే తమ ఇళ్ల వద్దకు వచ్చి వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆశాలపై రాజకీయ వేధింపులు తగవు



మాట్లాడుతున్న లక్ష్మి

శ్రీకాళహస్తి: ఆశాలపై రాజకీయ వేధింపులు తగవని, అవి మానుకోవాలని సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో మంగళవారం ఆశాల యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశాలు ప్రజారోగ్యమే లక్ష్యంగా రాజకీయాలకతీతంగా పని చేస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వాలు మారినపుడు వారిని తొలగించాలని చూడడం బాధాకరమన్నారు. పాలకులు ఈ విధానానికి స్వస్తి పలకాలన్నారు. కనీసం వాచ్‌మెన్ సౌకర్యం లేని పీహెచ్‌సీలో రాత్రి డ్యూటీలు వేయడం సమంజసమేనా? అన్ని ప్రశ్నించారు. తమకు ఇస్తున్న రూ.10వేలు సరిపోవడం లేదని కనీస వేతనం చట్టంప్రకారం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కవిత, లక్ష్మి, ఉష, సరల, చెంగాళమ్మ, రాణి, అను, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు లేఔట్లకు అనుమతులు

– తుడా ఉపాధ్యక్షులు మౌర్య



లేఔట్లలో పరిశీలిస్తున్న తుడా ఉపాధ్యక్షులు మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఔట్లకు నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం తుడా పరిధిలోని రేణిగుంట, వడమాలపేట, చంద్రగిరి వద్ద ఏర్పాటు చేసిన లేఔట్లలో కల్పించిన వసతులను తుడా అధికారులతో కలసి ఆమె పరిశీలించి మాట్లాడారు. తుడా పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఔట్లకు అధికారులు స్వయంగా వెళ్లి, ప్లాన్ ప్రకారం అన్ని ఉన్నాయా, లేవా? అని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ముఖ్యంగా లేఔట్‌లో ప్లాట్ల మధ్య రోడ్లు, డ్రైన్లు, బహిరంగ స్థలం, లైట్లు, నీటి సౌకర్యం ఉందా? అని పరిశీలించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా లేని లేఔట్లకు అనుమతులు మంజూరు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఓ దేవి కుమారి, ఏపీఓ సూర్యనారాయణమ్మ, జేపీఓలు, ఇతర ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'మరుగున' పడ్డాయ్!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నాయి. ఇందులో భాగంగా అధికారులు ప్రస్తుతం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. నీతులు ఎదుటివారికే కానీ తమకు కాదన్న చందంగా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోగా, మరికొన్ని కార్యాలయాల్లో ఉన్నా నిర్వహణ, నీరు లేమి కారణంగా మరుగున పడిపోయాయి. ఫలితంగా ఆయా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.



పంచాయతీ కార్యాలయంలో వృథాగా ఉన్న మరుగుదొడ్డి

- మరుగుదొడ్లు లేక సిబ్బంది, ప్రజలకు ఇబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని పలు కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో సిబ్బంది, పనుల నిమిత్తం వెళ్లిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం రోజుకు 200 మందికి పైగా వస్తుంటారు. అధికారులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మరుగుదొడ్లను తప్పనిసరిగా నిర్మించుకోవాలని గ్రామాల్లో పర్యటిస్తూ, మరుగుదొడ్ల అవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు. అయితే అధికారులున్న కార్యాలయాల అవరణల్లో మరుగుదొడ్లు నిర్మించుకోవడం మరచిపోయారు. కార్యాలయం లోపల మండల స్థాయి అధికారి మాత్రమే వాడుకోవటానికి కార్యాలయాల్లో ఒక్క మరుగుదొడ్డి మాత్రమే ఉంటుంది. మిగిలిన అధికారులు, కిందస్థాయి సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు మల, మూత్ర విసర్జన కోసం ఆరుబయటకు పరుగులు తీస్తున్నారు. మహిళ ఉద్యోగులు, మహిళలు బాధలు వర్ణనాతీతం. అధికారులు కార్యాలయాల అవరణలో మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకోకుండా ప్రజలను మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెప్పటం సమంజసం కాదంటున్నారు.





వ్యవసాయ కార్యాలయంలో మరుగుదొడ్డికి తాళం, ఎంపీడీఓ కార్యాలయంలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి